

సిట్ అలజడి


విజయానందరెడ్డి కార్యాలయం నుంచి రికార్డుల్ని తీసుకెళ్తున్న సిట్ అధికారులు

చిత్తూరులో విజయానందరెడ్డి, మోహిత్‌రెడ్డి కార్యాలయాల్లో సోదాలు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో 'సిట్' దర్యాప్తు చిత్తూరుకు చేరింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి జైల్లో వున్న విషయం తెలిసిందే. ఇటీవల మాజీ మంత్రి నారాయణస్వామిని కూడా పుత్తూరులోని ఆయన నివాసంలో రోజంతా విచారించారు.తాజాగా, చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆయనకు సిట్ నోటీసులు ఇవ్వగా, రెండు రోజుల కిందట విజయవాడకు వెళ్లి విచారణకు హాజరై వచ్చిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నగరం బీవీరెడ్డి కాలనీలోని నలందా నగర్‌లో ఉన్న విజయానందరెడ్డి అపార్ట్‌మెంటుకు సిట్ అధికారుల బృందం చేరుకుంది. అపార్ట్‌మెంటులోని రెండవ అంతస్థులో ఉన్న 'వెల్‌టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్' కార్యాలయంలో సిట్ ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 9 మంది అధికారులు తనిఖీ చేశారు. లిక్కర్ స్కామ్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ప్రధానంగా తనిఖీలు నిర్వహించారు.గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా లిక్కర్ సరఫరా చేసే టెండర్‌ను విజయానందరెడ్డి దక్కించుకున్నారనే సమాచారంతో సిట్ అధికారులు తనిఖీ చేశారు. ఆ కార్యాలయంలోనే ఉన్న మరో విభాగంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి చెందిన కార్యాలయం 'సీఎంఆర్' కూడా ఉంది. ఈ రెండు కార్యాలయాల్లోని పలు రికార్డులను సిట్ అధికారులు రాత్రి 8 గంటలకు వరకు తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డులను స్వాధీనం చేసుకుని వెంట తీసుకెళ్లారు. సిట్ అధికారులు తనిఖీ చేస్తున్నంతసేపు స్థానిక పోలీసులు లోపలికి ఎవరూ వెళ్లకుండా చూసుకున్నారు. సిట్ తనిఖీల విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా, విజయానందరెడ్డి ఆరోగ్యం బాలేదని చెన్నై అపోలో ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం.

విజిలెన్సుతో కలిసి చెవిరెడ్డి కార్యాలయంలో తనిఖీలు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని విచారిస్తున్న 'సిట్' అధికారులు బుధవారం తిరుపతికి వచ్చారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే అరెస్టయిన చంద్రగిరి మాజీ చైర్మన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో తనిఖీల నిమిత్తం అదనపు ఎస్పీ నేతృత్వంలోని 15 మంది వచ్చారు. వీరికి సహాయంగా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బందిని తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి వైసీపీ వర్గాల్లో కలకలం రేగింది. తనిఖీల్లో ఏ ఆధారాలు లభిస్తాయి.. వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన నెలకొంది. సిట్ అధికారులు తొలుత తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని కేవీఎస్ రియల్ ఎస్టేట్ కార్యాలయానికి చేరుకుని దాదాపు గంటపాటు తనిఖీలు జరిపారు. అక్కడ చెవిరెడ్డికి సంబంధించిన కార్యాలయాన్ని ఖాళీ చేసినట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఒంటిగంటప్రాంతంలో తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని 1-4 డోర్ నెంబరులోని చెవిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఇంటికి తాళం వేసి ఉంది. ఆ ఇంట్లోనే కార్యాలయమూ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సమీపంలోనే ఉంటున్న చెవిరెడ్డి తల్లి, సోదరుడు రఘునాధరెడ్డి తదితరులతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నమే చెవిరెడ్డి సతీమణి, కుమారులు హైదరాబాదు వెళ్లినట్లు తెలిసి వారితోనే ఫోన్ చేయించి ఇంట్లో తనిఖీలు చేపట్టాల్సి వుందని సమాచారం అందజేశారు. తాము రావడానికి రాత్రి 10 గంటలు అవుతుందని, అప్పటి దాకా గడువు ఇవ్వాలని వారు కోరినట్టు తెలిసింది. సాయంత్రం నాలుగున్నర తర్వాత ఆ ఇంటి నుంచి అధికారులు వెనుదిరిగారు. మరోవైపు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సంబంధించిన ఇన్‌ఫ్రా కంపెనీల్లోనూ సిట్ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. తిరుపతి, చిత్తూరుతో పాటు పలు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. కాగా, రికార్డుల్లో ఉన్న కంపెనీ పేర్లకు.. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న కంపెనీల పేర్లు వేర్వేరుగా ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా చెవిరెడ్డి ఆర్థిక లావాదేవీలను సిట్ పరిశీలించనున్నట్లు తెలిసింది.


తుమ్మలగుంటలో చెవిరెడ్డి ఇంటి వద్ద వేచివున్న అధికారులు

నేడూ కొనసాగనున్న తనిఖీలు

బుధవారం రాత్రి 9 గంటల వరకు చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఇంటి వద్దకు అతని కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. వీరు వచ్చాక గురువారం ఇంట్లో సోదాలు చేయనున్నారు. కాగా, చెవిరెడ్డి ఇంటివద్దకు సిట్, విజిలెన్సు బృందం చేరుకోగా.. వైసీపీకి చెందిన తిరుపతి రూరల్ ఎంపీపీ చంద్రమౌళిరెడ్డి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, సర్పంచులు కేశవులు, చిన్నియాదవ్, మైనారిటీ నాయకుడు కె.వలీ తదితరులు అక్కడకు చేరుకున్నారు.

ఆర్థికసంఘం నిధులు రూ.29.78 కోట్లు వచ్చేశాయ్!

గ్రామాల్లో ఊపందుకోనున్న అభివృద్ధి పనులు!

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం అన్ని గ్రామపంచాయతీల ఖాతాలకు మంగళవారం విడుదల చేయగా, ఆ మొత్తాలు బుధవారం జమయ్యాయి. సెప్టెంబరు మొదటి వారంలో ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.2024-25వ ఆర్థిక సంవత్సరంలో రెండో విడత నిధుల విడుదలలో జాప్యంపై ఇటీవల పలువురు సర్పంచ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది.రెండో విడతగా రూ.29.16 కోట్లు విడుదల కాగా అందులో టైడ్ గ్రాంట్‌గా రూ.17.50 కోట్లు, అన్‌టైడ్ గ్రాంట్‌గా రూ.11.66 కోట్లు కేటాయించారు. ఇదిలా వుండగా నిర్ణీత వ్యవధిలోగా ఇయర్ బుక్ క్లోజ్ చేయని కారణంగా 17 గ్రామపంచాయతీలకు సంబంధించి తొలి విడత నిధులు అప్పట్లో కేంద్రం విడుదల చేయలేదు. ఇటీవల అధికారులు ఆ 17 పంచాయతీల ఇయర్ బుక్ త్వరితగతిన పూర్తిచేయడంతో వారికి సంబంధించిన తొలి విడత నిధులు రూ.61.40 లక్షలను కేంద్రం మంగళవారం విడుదల చేసింది. ఇందులో టైడ్ గ్రాంట్‌గా రూ.47,74,197,అన్‌టైడ్ గ్రాంట్‌గా రూ.13,66,578 విడుదలయ్యాయి. ఎన్నికలు జరగని కారణంగా 13 గ్రామపంచాయతీలకు కేంద్రం ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం విడుదల చేసిన అన్‌టైడ్ గ్రాంట్ నిధులను గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్లు, సీసీరోడ్ల మరమ్మతులు, స్మశాన వాటికల నిర్మాణాలకు వినియోగించాలి. టైడ్ గ్రాంట్‌లో 50శాతం నిధులను పారిశుధ్య కార్యక్రమాలకు, మిగిలిన 50 శాతం నిధులను తాగునీటి కార్యకలాపాలకు వినియోగించాల్సి వుంది.

పెండింగ్‌లో 142 పీఆర్ పనులు

● ఎప్పటికి పూర్తి చేస్తారని ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):ఎంపీడీవోల పనితీరుపై కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన పథకం కింద 16 మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేశారన్నారు. ఇందులో ఆ గ్రామానికి కావాల్సిన తాగునీరు, మౌలిక వసతులు, మురిక్కాలువలు, ట్యాంకులు లాంటి అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు విడుదలయ్యాయని, అయితే అనేకమంది ఎంపీడీవోలు ఈ పనులకు సంబంధించిన పేపర్‌వర్కు కూడా మొదలుపెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన సమయం లోపు ఈ నిధులను ఉపయోగించకుంటే తిరిగి కేంద్రానికి వెళ్లిపోతాయన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.గుడుపల్లెలో పీఆర్ రోడ్డు నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరై 8 నెలలు కావస్తున్నా పనులు మొదలు పెట్టకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు రెజెల్యూషన్ ఇవ్వడం లేదని దీంతో పనులు మొదలు పెట్టలేకపోతున్నామని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ సర్పంచ్ రెజల్యూషన్ కోసం వేచిచూడకుండా పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు.ఎస్సీ గ్రామాల అభివృద్ధి కోసం వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేసి తీరాలన్నారు.కొన్ని గ్రామాల్లో ఎస్సీ జనాభా లేకున్నా ఎంపిక చేశారని, అలాంటి గ్రామాల స్థానంలో 500మంది ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలకు మార్చుకొని అక్కడ అవసరమైన అభివృద్ధి పనులు చేయాలన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టళ్లలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో మోహన్‌కుమార్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్రశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సి.హేమలత - ఎస్.నౌషద్ ఆలీ - నౌజియా

ఉపాధ్యాయ అవార్డులకు ముగ్గురి ఎంపిక

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాకు చెందిన ముగ్గురు టీచర్లు ఎంపికయ్యారు. పుంగనూరు మండలం రాంనగర్ మోడల్ ప్రైమరీ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సి.హేమలత, గుడిపాల మండలం నరహరిపేట జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్) టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.నౌషద్ ఆలీ, పుంగనూరు మండలం నక్కబండ కేజీబీవీలో స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)గా పనిచేస్తున్న నౌజియా వీరిలో వున్నారు. శుక్రవారం తాడేపల్లిలో విద్యాశాఖ నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు అవార్డులు అందుకోనున్నారు.

నలుగురు ఎస్ఐల బదిలీ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులును వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న నాగప్ప నాయక్‌ను చిత్తూరు వన్‌టౌన్‌కు, యూసఫ్‌ను పలమనేరు అర్బన్‌కు, త్యాగరాజులును చిత్తూరు ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.వీరంతా రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా ఐదుగురికి అవకాశం


మునస్వామి - రంగనాథ్


చిత్తూరు సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):వివిధ కార్పొరేషన్లకు జిల్లాకు చెందిన ఐదుగురు నేతలను డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది.నాటక అకాడమీ డైరెక్టర్‌గా గిరిబాబు (పూతలపట్టు), అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా సాదు దిలీప్ (చిత్తూరు), గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా మునస్వామి (రామకుప్పం), వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏఎం రంగనాథ్ (వి.కోట), ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ఉయ్యాల శ్రీనివాస్ (చిత్తూరు)లను నియమించింది.



బడికి తీసుకెళ్తానంటూ అత్యాచారయత్నం

వెదురుకుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బడికి తీసుకెళతానంటూ ఓ విద్యార్థిని(11)ని బైక్ ఎక్కించుకుని మార్గమధ్యంలో అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.వెదురుకుప్పం మండలానికి చెందిన 11 ఏళ్ల బాలిక ఓ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాలకు బయల్దేరిన ఆ బాలికను ప్రసాద్(40)అనే వ్యక్తి తన స్కూటర్‌పై ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో ఓ మామిడి తోటలోకి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చంపేస్తానంటూ బెదిరించాడు.జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు బాలిక చెప్పడంతో ఆమె తల్లికి, పోలీసులకు వారు సమాచారం ఇచ్చారు.

వైభవం... రథోత్సవం


చెన్నకేశవునితో...




రథంలో రాజా గణపతి | రథోత్సవానికి హాజరైన భక్తజనం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం మధ్యాహ్నం వరసిద్ధుడికి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.కాకర్లవారిపల్లెకు చెందిన కీర్తిశేషులు ఎత్తిరాజులునాయుడు, శివప్రసాద్ జ్ఞాపకార్థం మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ వీఎం పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ వీఎం కీర్తిశేషులు చంద్రశేఖరరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరిప్రసాదరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఘనంగా అభిషేకం నిర్వహించాక అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మరథంపై ఆశీనులను కావించి ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య రథాన్ని భక్తులు, ఉభయదారులు కొంత దూరం లాగి భక్తుల దర్శనార్థం ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బ్రహ్మరథంపై ఉప్పు, బొరుగులు, మిరియాలు, చిల్లర నాణస్త్రలు చల్లి, కొబ్బరి కాయలు సమర్పించి, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు.రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో పుష్పాలంకరణలు, వివిధ రకాల దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రథోత్సవ సమయంలో ఆలయ సిబ్బంది ధరించిన సైనికుల వేషధారణలు, కీలు గుర్రాలు ఆకర్షించాయి.అశేష భక్తజనం నడుమ మధ్యాహ్నం 3 గంటల సమయంలో రథాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు, ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్,ధనంజయ,సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు పాల్గొన్నారు. బ్రహోత్సవాల్లో గురువారం ఉదయం భిక్షాండి కార్యక్రమాన్ని,రాత్రి అశ్వవాహన సేవను నిర్వహించనున్నారు.కాగా ద్వారకా తిరుమల ఆలయం తరఫున ఈవో సత్యనాయణ బుధవారం వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను సమర్పించారు.


ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఈవో కిషోర్, ఉభయదారులు


ఎండు కర్జూరంతో తయారైన వినాయకస్వామి ప్రతిమ

శ్రీవారి సేవలో ప్రముఖులు





మణీందర్‌జిత్ బిట్టా - భూపిందర్ సింగ్ హుడా

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆలిండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్(ఏఐఏటీఎఫ్) ఛైర్మన్ మణీందర్‌జిత్ బిట్టా, హర్యానా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గోవిందుడి ఆలయంలో పవిత్ర ప్రతిష్ఠ



స్వామి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు చేస్తున్న అర్చకులు

గోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర ప్రతిష్ఠ ఆగమోక్తంగా జరిగింది. ఉదయం యాగశాలలో ఆకల్మష ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన చేశారు. అనంతరం కల్యాణ మండపంలో గోవిందరాజస్వామి ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. కర్పూర హారతులు సమర్పించారు. తర్వాత శాత్తుమొర, ఆస్థానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయర్లు, టీటీడీ డిప్యూటీ ఈవో వీఆర్.శాంతి, ఏఈవో ఏబీనారాయణచౌదరి, సూపరింటెండెంట్, ఆలయ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,925

తలనీలాలు సమర్పించినవారు: 21,338

'పట్టు' సాధించిన మగువలు

● పట్టు చీరల నేతలో నైపుణ్యం



మగ్గంపై చీర నేస్తున్న కార్మికురాలు

భాకరాపేట, ఆంధ్రజ్యోతి

చేనేత ..దయనీయ స్థితిలో కొట్టుమిట్లాడుతున్న రంగాల్లో ఇదొకటి.. ఆధునిక మరమగ్గాల ప్రవేశంలో ఎంతోమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. కానీ చినగొట్టిగల్లు మండలంలో మూడు గ్రామాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడి మహిళలకు అదే రంగం ఆసరాగా నిలుస్తోంది. వీరి నైపుణ్యప్రతిభకు పట్టం కడుతోంది. తొగటపల్లె, రంగన్నగారిగడ్డ, నల్లఓబులవారిపల్లె గ్రామాలలో తరుణీమణులే చేనేత మగ్గాలతో పట్టు వస్త్రాలను నేస్తూ సత్తా చాటుతున్నారు. మరమగ్గాలకు పోటీగా వీరంతా ధైర్యంగా నిలదొక్కుకున్నారు. కూటమి ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహకాలతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పనిలో కొత్తదనానికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పురుషులకు దీటుగా మెళకువలు నేర్చుకుని నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. సుమారు 200 కుటుంబాలు చేనేత పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సమీపంలోని వస్త్ర దుకాణాల వారు వీరి నుంచి పట్టు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క చేనేత సహకార సంఘం కూడా మార్కెటింగ్ పాత్ర పోషిస్తోంది. వీరిలో కొందరిని పలుకరిస్తే...

20 ఏళ్లుగా ఇదే ఆధారం



20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నాను. వేల రకాల చీరలు నేశాను, మరగ్గాలపై వచ్చే చీరలకు దీటుగామంచి డిజైన్లతో నాణ్యమైన చీరలను నేస్తున్నాను. నెలకు సుమారు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాను. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. నా భర్త కూడా ఇదే పని చేస్తున్నారు. మా ఇద్దరు అమ్మాయిలను చదివించుకుంటున్నాం.

- రోజా రమణి, నేత కార్మికురాలు, తొగటపల్లె

కుటుంబానికి ఆసరా



నేను నా భర్తతో కలిసి నేత పని చేస్తున్నాను. కుటుంబ అవసరాలకు తోడ్పడుతున్నాను. సంఘంలో రుణాలు తీసుకుని పిల్లలను చదివించుకుని పిల్లల పెళ్లిళ్ల చేశాము. ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు నేత ఆదాయంతో రుణాలను తీర్చుకుంటున్నాం.

- కుమారి, నేత కార్మికులరా, తొగటపల్లె

మగ్గమే ఆధారం



17 ఏళ్లుగా నేత పని చేస్తున్నాను. భర్త లేరు. ఇద్దరు పిల్లలనూ నేత పనితోనే పోషించుకుంటున్నాను. వారిని చదివించుకుంటున్నాను. తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు తీర్చుకుంటున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాను.

- సత్య, నేత కార్మికురాలు, రంగన్నగారిగడ్డ



చేనేత మగ్గం

శ్రీవారి సేవలో నటుడు శ్రీకాంత్

తిరుమల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు శ్రీకాంత్ బుధవారం సుప్రభాతసేవలో పాల్గొన్నారు. సతీమణి ఊహ, కుమారుడు, హీరో రోషన్‌తో కలిసి బుధవారం వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు శ్రీకాంత్ కుటుంబానికి పలువురు భక్తులు ఆసక్తిగా చూశారు. కొందరు వారితో సెల్ఫీలు దిగారు.



అతిథిగృహంలో కుటుంబ సభ్యులతో శ్రీకాంత్

భక్తులు మెచ్చేలా పోలేరమ్మ జాతర: కురుగొండ్ల



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ విష్ణువర్ధన్ రాజు తదితరులు

వెంకటగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను భక్తులు మెచ్చేలా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి ఒక్కరూ అమ్మవారిని సులభంగా దర్శించుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సారి వీఐపీ పాసులు కేవలం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు మాత్రమే అందజేస్తామని స్పష్టం చేశారు. సామాన్య భక్తులు ఇబ్బంది పడకుడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు విడుదలైనట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని అమ్మవారి జాతరను విజయ వంతం చేయాలని కోరారు. జాతర నిర్వహణ ఏర్పాట్లపై గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు. జాతర రోజే రూ.1.60 కోట్లతో పోలేరమ్మ ఆలయ కమర్షియల్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణాలకు భూమిపూజ ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను రప్పిస్తున్నట్లు తెలిపారు. చోరీల నియంత్రణ కోసం డ్రోన్ కెమెరాలతో పర్యవేణ ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు మఫ్టీలో ప్రత్యేక సిబ్బందితో నిఘా ఉంచుతామన్నారు. అనంతరం జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంట మురళి, ఎంపీపీ తనూజారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధించిన యువకుడిపై కేసు

చిట్టమూరు, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని వేధించడంతో పాటు దాడికి పాల్పడిన యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన రాజీవ్ అనే యువకుడు తనను ప్రేమించాలంటూ ఏడాది నుంచి బాలికను వేధిస్తున్నాడు. బాలిక బంధువులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ రాజీవ్‌లో మార్పు రాలేదు. మంగళవారం సాయంత్రం తరగతులు పూర్తయ్యాక తోటి విద్యార్థునులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఉండగా రాజీవ్ మోటార్ బైక్‌పై వచ్చి తన ప్రేమను అంగీకరించాలని బాలికపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి వెళ్తుండగా తన అన్న ప్రేమను అంగీకరించాలంటూ రాజీవ్ సోదరి కూడా బాలికపై దాడి చేసింది. బుధవారం బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా పనిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, అసహాయుల సంక్షేమానికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రీన్ క్లైమెట్ ఫండ్(జీసీఎఫ్) జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, పరిసర గ్రామాల్లో సాగు, జీవనోపాధి సంబంధిత కార్యకలాపాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.వాటర్‌షెడ్ కార్యక్రమాలు స్థానిక ప్రజలకు లాభదాయకమవుతాయని తెలిపారు. ముఖ్యంగా సముద్ర శైవల సాగు, మత్స్య ఉత్పత్తులతో వలన మత్స్యకారుల ఆదాయం పెరిగే అవకాశముంటుందని, దానిపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు సెల్వం, జయంతి, హారిక, మహ్మద్ రఫీ, సామియేలు, జశ్వంత్, శోభన్‌బాబు, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ఉడ్ ప్లాంటేషన్‌తో లాభాలు పొందవచ్చు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీఎఫ్ ప్రసంగిస్తున్న సెల్వం

మంగళం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టింబర్ వుడ్ ఆధారిత ప్లాంటేషన్ ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సీసీఎఫ్ సెల్వం తెలిపారు. తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయంలో బుధవారం రైతులకు బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీశాఖ సంయుక్తంగా వెదరు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి 70మంది రైతులు హాజరయ్యారు. టింబర్ వుడ్ ప్లాంటేషన్ ద్వారా కలిగే లాభాలు, మొక్కలను ఎలా పెంచాలి, వాటని ఎలా విక్రయించాలి అనే అంశాలపై శిక్షణ కల్పించారు. సీసీఎఫ్ సెల్వం మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే రైతులు ఎర్రచందనం మొక్కలను పెంచుతున్నారన్నారు. అయితే అంతర్జాతీయ డిమాండ్‌కు తగ్గట్టుగా రేటు రాకపోవడమో, ఇతర కారణాల వల్లో రైతులు ఎర్రచందనం పెంచడం తగ్గిందన్నారు. బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు నరేన్ ధిరన్ మాట్లాడుతూ ఎర్రచందనానికి ఇతర టింబర్ వుడ్‌ట్రీ కన్నా ఆదాయం ఎక్కువ వస్తుందన్నారు. రైతులు వుడ్ ప్లాంటేషన్ చేపడితే తిరుపతి జిల్లా నుంచి కూడా సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చరల్ అధికారి దశరథ రామిరెడ్డి, అధికారులు పవన్ కుమార్, నాగభూషణం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైంటిస్టులు నరసింహమూర్తి, ఎంవీ దొరై పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు



భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించి మూలవిరాట్లకు పునరుత్తేజం తెచ్చే విధంగా ఈ పూజలను నిర్వహిస్తుంటారు. ఐదురోజుల పాటు జరిగే పూజల్లో తొలిరోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణాహారతులు సమర్పించారు. అనంతరం భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకున్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధుల విడుదల

● రేణిగుంటకు అత్యధికంగా రూ.43లక్షలు

● డీపీవో సుశీలాదేవి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలు జరిగిన 745 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండు విడతల్లో రూ.63.62కోట్ల మేర విడుదలయినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. తమ కార్యాలయంలో ఆమె బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ నిధులను ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. మొదట టైడ్ గ్రాంట్‌గా రూ.18.24కోట్లు, అన్‌టైడ్ కింద రూ.12.03కోట్లు వచ్చాయన్నారు.రెండవ విడత టైడ్ గ్రాంట్‌గా రూ.20కోట్లు, అన్‌టైడ్ కింద రూ.13.33 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. ఈమొత్తం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో అత్యధికంగా రేణిగుంట పంచాయతీకి రూ.43.03లక్షలు, అత్యల్పంగా పిచ్చాటూరు మండలం అప్పలరాజుకండ్రిగ గ్రామపంచాయతీకి రూ.53.582 జమ అయిందన్నారు. టైడ్ గ్రాంట్ కింద 50శాతం పారిశుద్ధ్యం, మరో 50శాతం తాగునీరు, వర్షపునీటి నిల్వ,పంచాయతీల అభివృద్ధి కార్యక్రమానికి వినియోగిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తే పంచాయతీకార్యదర్శులపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

సీఐ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీవీ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ హరీ‌ష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది సీఐలకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇందులో జిల్లా పరిధిలో 29 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేసిన శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈయన 1995లో పోలీసు శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరారు. మొదటిసారిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని నింద్ర, వరదయ్యపాళెం, నాగలాపురం, మదనపల్లె, సత్యవేడు, ఎర్రావారిపాళెం, కలికిరి ప్రాంతాల్లో పనిచేశారు. 2011లో సీఐగా పదోన్నతి లభించింది. అక్కడి నుంచి పీటీసీలో మూడేళ్ల పనిచేశారు. అనంతరం అలిపిరి, మహిళా పోలీసుస్టేషన్, సత్యవేడు, చంద్రగిరి, తిరుపతి క్రైంలో పనిచేసి శ్రీసిటికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీఎస్పీగా పదోన్నతి లభించింది.

నిబద్ధత, అంకితభావంతో పనిచేయండి

● బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లోని పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించడానికి బీసీ వెల్ఫేర్ అధికారులు నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో బుధవారం రాయలసీమలోని జిల్లాలకు సంబంధించిన వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులకు సెన్స్‌టైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ అధికారులు వసతిగృహ విద్యార్థుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. బీసీ సంక్షేమ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వసతిగృహాల్లో ట్యూటర్లను నియమించి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. మెను తప్పకుండా అమలుచేయాలన్నారు. సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ వారం వారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మంచి ఫలితాలు సాధించాలని ఆదేశించారు.



సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

7న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈనెల7 రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు అండర్-11, 13, 15 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. స్థానికంగా 25 మంది ఇప్పటికే ఈ టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. అటువంటి క్రీడాకారులను ఈ టోర్నమెంటు ద్వారా ప్రోత్సాహం అందించినట్లు అవుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు రవిచంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై డివైడరును ఢీకొన్న బైకు

● ఇద్దరికి బలమైన గాయాలు





తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ వద్ద గరుడ వారధిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి కొర్లగుంటకు చెందిన రోహిణీకుమార్, అతడి స్నేహితుడు పి. రాజశేఖర్ తిరుచానూరు వైపు నుంచి గరుడ వారధిపై తిరుపతికి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. మద్యం మత్తులో వేగంగా వాహనం నడిపి లక్ష్మీపురం సర్కిల్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. వీరి తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన కొందరు వాహనదారులు ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. రక్షక్ ఏఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రోహిణీకుమార్‌కు వెంటిలేటర్‌పై.. పి.రాజశేఖర్‌కు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా వారి వివరాలు తెలుసుకోవడంలో ఈస్ట్ పోలీసులు సరిగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. జరిగిన ఘటనపై రక్షక్ ఏఎస్ఐని సంప్రదించినా తమకేమి తెలియదని చెప్పడం గమనార్హం.

మెడికల్ షాపులపై దాడులు

● బిల్లుల్లేని 18 రకాల మందుల గుర్తింపు



మందులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు పద్మావతి ఇంటిగ్రేటెడ్ పాలి హాస్పిటల్లోని శ్రీపద్మావతి మందుల దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా మందులు వి క్రయిస్తున్నారనే సమాచారం రావడంతో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం రాత్రి దాడులు చేశారు. అబార్షన్‌కు ఉపయోగించే 10 రకాలు, నార్కోటిక్స్(ఎన్ఆర్ఎక్స్), బిల్లులు లేకుండా విక్రయిస్తున్న 18 రకాల మందులను గుర్తించారు. వీటిని తిరుపతిలోని పలు మందుల ఏజన్సీల నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అలాగే పలు ఏజన్సీలకు సంబంధించి 15 ఇన్వాయిస్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రిలోని హోమియోపతి వైద్యురాలు డాక్టర్ ఎంశైలజ రోగులకు అనధికారికంగా అబార్షన్ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రీతు పాల్గొన్నారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాత

తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. గుంటూరుకు చెందిన ఆలపాటి సురేష్ ఈ విరాళాన్ని ఇచ్చారు. తిరుమలలో బుధవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మామోగ్రాం సర్వీస్ ప్రారంభం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మామోగ్రామ్ ఏర్పాటు మహిళలకు వరంలాంటిదని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అపోలో గ్రూపు ఏర్పాటు చేసిన మామోగ్రామ్ సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు సాధారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతుంటారని, వాటిని గుర్తించేందుకు చిత్తూరులో సరైన పరికరాలు లేవన్నారు.అపోలో యాజమాన్యం మామోగ్రాం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు.మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, అపోలో, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్లు రంగనాథ్, ఉషశ్రీ, అపోలో సీవోవో నరేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎంవో సంధ్య, రేడియాలజిస్ట్ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'విండోల్లో' నూతన వ్యాపారాలపై దృష్టి పెట్టండి:అమాస



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలు(సింగిల్‌విండోలు) నూతన వ్యాపారాలపై దృష్టిపెట్టి లాభాలు గడించాలని డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సింగిల్‌విండోల అధ్యక్షులకు సంఘ కార్యకలాపాలు, సహకార చట్టాలు, సంఘాల బలోపేతం, డీసీసీబీకి సింగిల్ విండోల సంబంధాల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత బ్యాంకు సీఈవో శంకర్ బాబు నూతన అధ్యక్షులకు వారి అధికారాలు-అమలు అంశాలనువివరించారు.ఛైర్మన్ మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి బంగారం రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జన ఔషధి దుకాణాలు, పెట్రోల్ బంకులు, నిర్మాణమై ఖాళీగా వున్న గోదాములను బాడుగలకు ఇవ్వడం, వాటిపై ప్రతిపాదనలు డీసీసీబీకి పంపితే పరిశీలిస్తామన్నారు.డీసీవో లక్ష్మి, డీసీఏవో నారాయణమ్మ, బ్యాంకు జీఎం మనోహర్ గౌడ్, చిత్తూరు డీఎల్‌సీవో వెంకటరమణ పాల్గొన్నారు.

తలనొప్పితో మూడవ తరగతి విద్యార్థిని మృతి

● టీచర్ కొట్టడంతోనే అంటున్న తల్లి


నిషావాణి మృతదేహం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్వరం, తలనొప్పితో బాధపడుతూ ఓ చిన్నారి బుధవారం చనిపోయింది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని గోకులం వీధికి చెందిన ఇందుకు ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాలతో భర్త వదిలి వెళ్లిపోవడంతో కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఇద్దరు పిల్లల్లో పెద్ద కుమార్తె నిషావాణి ఖాజీ పాఠశాలలో మూడో తరగతి చదవుతోంది. గత నెల 21వ తేదీన పాఠశాల నుంచి తీసుకెళుతుండగా నిషావాణి తలనొప్పిగా ఉందని చెప్పింది. దాంతో మందులషాపులో మాత్రలు కొనివ్వగా తలనొప్పి తగ్గలేదు. తరచూ తలనొప్పి, జ్వరం వస్తుండటంతో ఈ నెల 1వ తేది చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చూపించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సలహా మేరకు ఆస్పత్రిలో చేర్పించినప్పటికీ రోజు రోజుకూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. అయితే పాఠశాలలో టీచర్ తలపై బలంగా కొట్టడంతోనే తలనొప్పితో బాధపడేదని, ఆ విషయాన్ని తన కుమార్తె తనకు చెప్పిందని మృతురాలి తల్లి ఇందు ఆరోపించారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని మృతురాలి తల్లి కోరారు.

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగ ల ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆయన కథనం మేరకు... గత జూలై నెలలో పుంగనూరు కుమ్మరవీధికి చెందిన వృద్ధురాలు భాగ్యలక్ష్మి దుకాణానికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని దొంగలు ద్విచక్రవాహనంలో వచ్చి తన బంగారు చైన్ లాక్కెళ్లారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఉదయం పట్టణ శివారు ప్రాంతంలో అనుమానంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పంచమాలెన్‌కట్టాలోని గాంధీనగర్‌కు చెందిన రహ్మత్‌అలీ కుమారుడు హంసయూస్సన్(30), తిరునగర్‌కు చెందిన బోలోహూస్ కుమారుడు మహ్మద్‌పితా(25)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిని మదనపల్లె కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15రోజులు రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు ఇద్దరు కలిసి తమిళనాడు రాష్ట్రంతో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఆయన వివరించారు.

మహిళాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

స్త్రీ శక్తి విజయోత్సవ సభలో చల్లా బాబు





సభలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి - మహిళలతో కలసి బోయకొండకు వెళుతున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె/పుంగనూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మరో పదేళ్ల చంద్రబాబు సీఎంగా ఉంటే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లె మండలం దిగువపల్లెలో పుంగనూరు నియోజకవర్గస్థాయి స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏ సీఎం చేయని సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ నేతలు చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు,కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సోమల ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు,ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, సుహేల్‌బాషా, జి.సుబ్రహ్మణ్యం,భూషణ, సదుం సునీల్‌రెడ్డి,రవికుమార్ నాయుడు, ధనంజయనాయుడు,రెడ్డిప్రసాద్‌రెడ్డి,మహేశ్వరరెడ్డి, శంకర్, రామకృష్ణంరాజు, మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ పార్వతి, రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐలు నాగేశ్వరరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలాదిమంది మహిళలతో గంగమ్మ దర్శనం

సభకు ముందు వేలాదిమంది మహిళలతో కలసి చల్లా రామచంద్రారెడ్డి తదితరులు కాలినడకన కొండపైకి వెళ్లి బోయకొండ గంగమ్మను దర్శించుకుని సీఎం చంద్రబాబు ఆరోగ్యంగా, మరో పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉండేలా దీవించాలని పూజలు నిర్వహించారు. మహిళలందరికీ స్త్రీ శక్తి పేరుతో అమ్మవారి పసుపు కుంకుమ, లడ్డుప్రసాదాలు అందజేశారు.మహిళలు చంద్రబాబు ఫొటోలకు పాలాభిషేకం చేసి ర్యాలీలో పాల్గొన్నారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి మహిళలు భారీఎత్తున సభకు బస్సుల్లో తరలివచ్చారు.

నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి!



● స్విమ్స్ డెంటల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు వైసీపీ నేత టార్గెట్
● 2023లో తీవ్ర పోటీతో పెండింగ్
● జాగ్రత్తగా ప్లాన్ చేసి తాజా నోటిఫికేషన్ జారీ
● నేటికీ స్విమ్స్‌ను వీడని వైసీపీ ప్రభావం

స్విమ్స్ అధికారులు 2023 అక్టోబరు 22న రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 'డెంటిస్ట్రీ'గా పేర్కొన్నారు. తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ ఈ పోస్టును చూపారు. డిపార్టుమెంట్ అన్న కాలమ్‌లో డెంటిస్ట్రీ బదులు 'ఓరల్, మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' అని పేర్కొన్నారు.

తాను అనుకున్న వ్యక్తికి ఆ పదవి దక్కేలా తిరుపతిలోని వైసీపీ ముఖ్యనేత ఒకరు చెప్పడంతో తాజా నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ బదులు.. ఎండీఎస్‌లో ఒక స్పెషాలిటీ పేరు పెట్టారని అంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలైనా స్విమ్స్‌లో మాత్రం ఆయన ప్రభావం కనిపిస్తుండటం ఈ నోటిఫికేషనే నిదర్శనం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గత నెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో డెంటల్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఉంది. ఆ విభాగాన్ని డెంటిస్ట్రీ అని పేర్కొనాలి. దీనికి ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ)లో ఎనిమిది స్పెషాలిటీల వైద్యులందరూ దరఖాస్తు చేయడానికి అర్హులవుతారు. ఆ ప్రకారమే 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. మరిప్పుడు ప్రత్యేకించి 'ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ' అన్న స్పెషాలిటీని మాత్రమే నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇలా చేయడం వెనుక తిరుపతికి చెందిన వైసీపీ ముఖ్య నేత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ నేత సిఫార్సు చేసిన వ్యక్తికి ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు దక్కేందుకే ఇలా చేశారని అంటున్నారు. 2023 అక్టోబరు 22న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును చేర్చారు. ఆ పోస్టుకు వైసీపీ నేత తనకు కావాల్సిన అభ్యర్థిని సిఫారసు చేసినట్లు సమాచారం. అప్పట్లో వైసీపీనే అధికారంలో ఉండటంతో ఆ నేత సూచించిన అభ్యర్థికే ఆ పోస్టు దక్కుతుందని ధీమాతో ఉన్నారట. అందుకని రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకుని ఆ నేత వ్యక్తిగత సహాయకుడి ద్వారా రూ.23 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అప్పట్లో ఈ పోస్టుకోసం రాష్ట్ర అత్యున్నత నేత.. సీఎంవోలో చక్రం తిప్పిన అధికారి తమ వాళ్లకూ సిఫారసు చేయడంతో టీటీడీ కీలక అధికారి తీవ్ర ఒత్తిడికిలోనై ఆ పోస్టును భర్తీ చేయలేదని సమాచారం. ఆ డబ్బు వెనక్కి ఇవ్వాలని ఆ వ్యక్తి వైసీపీ నేతను ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. డబ్బు ఇవ్వని ఆయన.. వైసీపీ ప్రభుత్వంలో నియమితులై ఇప్పటికీ కొనసాగుతున్న స్విమ్స్ కీలక అధికారులపై ఒత్తిడి తెచ్చి తాజా నోటిఫికేషన్‌లో ఆ పోస్టును మళ్లీ చేర్చినట్టు ప్రచారం జరుగుతోంది. తాను సూచించిన అభ్యర్థికే పోస్టు దక్కేలా .. ఆ వ్యక్తి చేసిన స్పెషాలిటీని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారనే ప్రచారం నడుస్తోంది. ఇలాగైతే తక్కువ మంది దరఖాస్తు చేస్తారని తద్వారా తమ అభ్యర్థికి అవకాశం ఇప్పించుకోవచ్చని ఆ నేత భావించారట. ఈ విభాగంలోని రెగ్యులర్ ప్రొఫెసర్‌ది 'ఓరల్, మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' స్పెషలైజేనే. ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కూ ఇదే స్పెషాలిటీ పేర్కొనడం ద్వారా స్విమ్స్ అధికారులు తీవ్ర విమర్శలను, ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆ అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టును డెంటిస్ట్రీ డిపార్టుమెంటు కింద చూపకుంటే తామంతా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతామని స్విమ్స్‌లోనే డెంటల్ విభాగంలో అడహాక్ పోస్టుల్లో కొనసాగుతున్న కొందరు బతిమలాడినట్టు సమాచారం. వారికి ఆ వైసీపీ నేత వ్యక్తిగత సహాయకుడు.. స్విమ్స్‌లో కొందరు అధికారుల నుంచీ బెదిరింపులు ఎదురైనట్టు తెలిసింది. దీనిపై వివరాలు సేకరించిన టీటీడీ పాలకమండలి సభ్యులొకరు టీటీడీ ఈవోకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. కాగా, గత ప్రభుత్వంలో పెద్దల సిఫారసుతో బయటి నుంచి నియమితులైన కీలక అధికారులు ఇంకా కొనసాగుతుండటంతో వైసీపీ హవా నడుస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

● ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో లేదా ఇతర ప్రసార మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.సీఎం చంద్రబాబు ప్రారంభించిన హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయిందని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ వార్త పూర్తిగా అవాస్తమన్నారు.ప్రజలు నమ్మదగిన ప్రసార మాధ్యమాల ద్వారానే సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రసారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటలపై గజరాజుల బీభత్సం



కల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. సుమారు రెండేళ్ల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు వివిధ దఫాలుగా పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు అపారనష్టం కలిగిస్తున్నాయి. ఏనుగుల గుంపు దాడుల్లో నష్ట పోయిన పంటలకు తూతూమంత్రంగా పరిహారం చెల్లిస్తుండటంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడులతో పంటలను పూర్తిగా కోల్పోతున్నామని, ఇక ఆత్మహత్యలే శరణ్యంగా ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని చల్లావారిపల్లి పంచాయలో మంగళవారం రాత్రి రాగి, వేరుశనగ, కొబ్బరిచెట్లను ఏనుగుల ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం జరిగింది. ముందుగా తూర్పు విభాగం అటవీప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన ఏనుగుల గుంపు చల్లావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని దామోదర్‌నాయుడుకు చెందిన ఎకరా టమోటాపంట, అర ఎకరా వరిపంటను ఏనుగుల గుంపు చేశాయి. రైతు రామచంద్రకు చెందిన ఎకరా రాగిపంట, వేరుశనగ పంటను ధ్వంసం చేశాయి. సుమారు 30 ఏళ్ల కొబ్బరిచెట్టును నేలమట్టం చేశాయి. రైతులు ఎస్వీరమణ, వేణుకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. బుధవారం పగలంతా గంటావారిపల్లికి తూర్పు విభాగంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు స్థానిక ప్రజలు తెలిపారు.

అక్టోబరు 25న బాలోత్సవం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబరు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాప్, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలతోపాటు జానపద నృత్యం, జానపద గీతాలు, భక్తిగీతాలు, కోలాటం, క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని వివరించారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించడానికి స్వచ్ఛంద సేవకులు పేర్లను 9398000686 నంబరు వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

పలమనేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో బుధవారం రూ.80 వేలు విలువైన 4 కిలోల గంజాయిని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. డీఎస్పీ ప్రభాకర్ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పుంగనూరుకు చెందిన షేక్ సుల్తాన్ (29), ఎస్.ఖాజా(29), రామసముద్రంలోని దిగువపేటకు చెందిన బర్మా సయ్యద్ జుల్ఫర్‌నెయిన్ (28), సయ్యద్ మొహమ్మద్ ఇస్మాయిల్(27)లు గంజాయి విక్రయాలు చేపడుతుతూ స్వాధీనం చేసుకొన్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ముద్దాయిలతోపాటు పలమనేరు అర్బన్ సీఐ మురళీమోహన్, గంగవరం సీఐ పరశురాముడు, పలమనేరు ఎస్ఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 5, పలమనేరులో ఒక బార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఒక్కో బార్‌కు రూ.5.10 లక్షలు తిరిగిరాని దరఖాస్తు రుసుముగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 14వ తేది సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ, 15వ తేది ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో లాటరీ ద్వారా బార్‌ల కేటాయింపువుంటుందని ఆప్రకటనలో ఈఎస్ తెలిపారు.

భారీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో అర్హులైన ఐదుగురు మహిళలకు భారీ మోటార్ డ్రైవింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు ఎస్సీలుగా ఉండి, కనీస వయస్సు 20 సంవత్సరాలు ఉండాలన్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు ఎల్ఎంవీ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. హెవీ మోటారు వెహికల్ ఎల్ఎల్ఆర్ కోసం రూ.210, లైసెన్స్ కోసం రూ.1060 మాత్రమే అభ్యర్థి చెల్లించాల్సి ఉందన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో భారీ మోటార్ డ్రైవింగ్‌ను ఉచితంగా నేర్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు లైట్ మోటారు వెహికల్ లైసెన్స్‌ను తీసుకుని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం, అంబేద్కర్ భవన్ మొదటి అంతస్తు, న్యూ కలెక్టరేట్, చిత్తూరు అనే చిరునామాలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 99590 15657 నెంబరును సంప్రదించాలని కోరారు.

చీటీల పేరుతో ఆర్పీ మోసం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో మహిళా పొదుపు సంఘాల ఆర్పీ తమను మోసం చేసిందని బాధితులు ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ నగరంలోని మిట్టూరుకు చెందిన ఆర్పీ శ్వేత, ఆమె భర్త రిటైర్డ్ ఆర్మీ జవాన్ కిరణ్ చీటీల వ్యాపారం పేరుతో సుమారు రూ.80 లక్షల వరకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని చెప్పారు. తమ పేరుతో మహిళా గ్రూపుల్లో లోన్లు తీసుకోవడం, చీటీలు వేసి డబ్బులు ఇవ్వకుండా బెదిరించడం, తమ నగలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవడం, చీరల వ్యాపారం చేస్తున్నానని లక్షల్లో వడ్డీలకు తమ దగ్గర తీసుకున్నారని చెప్పారు. తమ డబ్బు తిరిగి ఇవ్వమని అడిగితే భార్యాభర్తలు గన్‌తో బెదిరిస్తున్నారని చెప్పారు.

చిత్తూరు ఏఎంసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే జగన్మోహన్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ ఛైర్‌పర్సన్ అనురాధ ప్రమాణం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):మామిడి రైతులకు సబ్సిడీ విషయంలో సహకరించని గుజ్జు ఫ్యాక్టరీలకు సహచర ఎమ్మెల్యేలతో కలిసి తాళం వేయిస్తానని ఎమ్మెల్యే జగన్మోహన్ హెచ్చరించారు. చిత్తూరు ఏఎంసీ పాలక మండలి బుధవారం మార్కెట్ యార్డులో ప్రమాణస్వీకారం చేసింది. గౌరవ అధ్యక్షుడిగా జగన్మోహన్, ఛైర్‌పర్సన్‌గా ఝాన్సీ వెంకటేష్, వైస్ ఛైర్‌పర్సన్‌గా టి.అనురాధ, సభ్యులుగా జి.రామ్మూర్తి, ఎ.గంగి నాయుడు, ఇ.గోవిందస్వామి, జి.రాణి, ఎంఎస్ నందిని, వి.నాగరాజు, కేబీ జయపాల్, ఎ.మోహన్‌నాయుడు, సయ్యద్ ఫిరోజ్, ఎంజీ హేమచంద్ర, ఆరణి అంజలి, ఎం.మీనాక్షి, కె.గౌరీలతో మార్కెటింగ్ ఏడీ, ఏఎంసీ కార్యదర్శి పరమేశ్వరన్ ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించగా కొన్ని ఫ్యాక్టరీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని రైతు సంఘం నాయకులు తమ దృష్టికి తెచ్చారన్నారు.సీఎం నిర్దేశించిన ధర రైతులకు ఇవ్వని పక్షంలో పూతలపట్టు, జీడీ నెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలతో కలసి ఫ్యాక్టరీలకు తాళం వేస్తానని హెచ్చరించారు.చిత్తూరు ఏఎంసీకి ఆదాయ వనరులు సమకూర్చడంతో పాటు మామిడి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్,యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ అధ్యక్షుడు సీఎంటీ త్యాగరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చంద్రప్రకాష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ నాగేశ్వరరాజు, టీడీపీ నాయకులు కోదండయాదవ్, అశోక్ ఆనంద్‌యాదవ్, షణ్ముగం, వైవీ రాజేశ్వరి, నళిని, మోహన్‌రాజ్, నీరజాక్షులు నాయుడు, జీవన్, రఘు, సుబ్రమణ్యం, నరేష్‌కుమార్, మేషక్, పీటర్, సప్తగిరి ప్రసాద్, భాస్కర నాయుడు, లత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జనసేన నాయకురాలు ఆరణి కవిత తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెం తీరం... కల్లోలం

● వేట విరమించిన మత్స్యకారులు



వాకాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాకాడు మండలంలోని తూపిలిపాళెంలోని సముద్రతీరం కల్లోలంగా మారింది. వాతావరణంలో మార్పుతో ఆరు మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడుతున్నాయి. కొన్ని నిమిషాల పాటు సముద్రం నిశబ్దంగా మారుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పును బట్టి మత్స్యకారులు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామునుంచే హోరుగాలితోపాటు ఇసుకరేణువులు గాలిలో తేలి తూపిలిపాళెం సముద్రతీరంలో వచ్చిన పర్యాటకులకు, నిమజ్జనానికి విచ్చేసిన భక్తులకు తీవ్ర ఆటంకంగా మారింది. అల్పపీడన ప్రభావంతో తీర ప్రాంతాలకుచెందిన తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, వైట్‌కుప్పం తదితర గ్రామాల మత్స్యకారులు వేట విరమించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అధికారులు తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించడానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈడిగపల్లె, గుడిసెబండ, సుగాలిమిట్ట, జౌకొత్తూరు, సింగిరిగుంట, చంద్రమాకులపల్లె హైస్కూల్స్‌లో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వాటికి అవసరమైన మండలపరిషత్ జనరల్‌ఫండ్ నుంచి నిధులు అందించి సమస్య పరిష్కరించాలని కోరారు. గత ఏడాదిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రైతులు డీడీలు చెల్లించినా ఇప్పటి వరకు రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోతే రైతులు ఏలా వ్యవసాయం చేయాలని విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. ఎంపీటీసీ పురుషోత్తం మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు సచివాలయ సిబ్బంది ఏమాత్రం విలువ ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, 3 ఎకరాల నుంచి 5ఎకరాలు వరి సాగు చేసిన రైతులకు ఒక బస్తా యూరియా ఇస్తే ఏమి చేయాలని నిలదీశారు. ఏవో రాధ మాట్లాడుతూ రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తుందన్నారు. రైతులు యూరియా వాడకం కన్నా నానో యూరియా వాడకం వల్ల దిగుబడి పెరుగుతుందని వివరించారు. ఏఎంసీ చైర్మన్ శమిపతి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని, అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, కోఆప్షన్ సభ్యులు నవాజ్, ఏవో రెడ్డెమ్మ, ఎంఈవో నటరాజరెడ్డి, ఎస్పీడీసీఎల్ ఏఈ ధనంజయరావు, డాక్టర్ సృజన, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెస్కో పాలక మండలి ప్రమాణ స్వీకారం

కుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) పాలక మండలి ప్రమాణ స్వీకారం గురువారం అట్టహాసంగా జరుగనుంది. కుప్పం రెస్కో చైర్మన్‌గా వీజీ.ప్రతాప్, సభ్యులుగా ఆర్ముగం, పి.శివ, ఎన్ఎస్.తులసీనాథ్, సి.మురళి, హరోహరన్, జీఎస్.అనసూయ, బసవ రాజు, ఆర్.శరణ్‌కుమార్, మునివెంకటప్ప, ఎం.బాలగంగాధర్, అమీర్ బాషా, ఎన్.విజయకుమార్, పి.సతీశ్‌లతో ప్రభుత్వం ఇటీవల నూతన పాలకమండలిని నియమించిన విషయం తెలిసిందే. ఈ పాలకమండలి గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేయనుంది. కుప్పం చెరువుకట్టనుంచి ఊరేగింపుగా వచ్చి, ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన అనంతరం ప్రమాణ స్వీకారం చేస్తామని రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్ తెలిపారు.

మణీంద్రం ఎంపీటీసీగా అరుణ ప్రమాణ స్వీకారం



ఎంపీటీసీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అరుణ

రామకుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతోందని రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీగా ఎన్నికైన అరుణ బుధవారం పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలిచిన ఎంపీపీ శాంతకుమారి అనారోగ్యంతో మృతి చెందడంతో గత నెల ఎంపీటీసీ ఉపఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ ఆమెచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచన, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి, రెస్కోవైస్‌చైర్మన్ విశ్వనాథ్, రెస్కోవైస్‌చైర్మన్ విశ్వనాథ్, డీటీ బాలాజీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

1బీ కోసం ఏడాదిన్నరగా నిరీక్షణ



సదుం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భూహక్కుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ సంబంధిత వీఆర్వో, తహసీల్దారు, పలమనేరు ఆర్డీవో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు వినతుల సమర్పించున్నా ఫలితం లేదని బాధితుడు రియాజ్ తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నాడు. సదుం నివాసి రియాజ్ బాషా తన ముగ్గురు అన్నదమ్ములతో పాటు తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని సమానంగా పంచుకున్నారు. వారందరికీ 1బీలు, పాసు పుస్తకాలు వచ్చాయి. గత తెలుగుదేశం హయాంలో ఖాతా నెంబరు 1415తో పాసు పుస్తకం ఉంది. జగనన్న భూసంరక్షణ కార్యక్రమం తరువాత ఇతనికి రావడం లేదు. దీనిపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా వినతి పత్రాలు సమర్పించినా, స్థానిక సచివాలయంలో మాత్రం 'నీ పేరుతో ఎలాంటి భూమి లేదు. 1బీ ఇచ్చే అవకాశం లేదు' అంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్థానిక తహసీల్దారు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని బాధితుడు కోరుతున్నాడు.

పింఛను నిధులు స్వాహా చేసిన కార్యదర్శి అరెస్టు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతవులు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఇవ్వాల్సిన ఎన్టీఆర్ బరోసా పింఛన్ డబ్బులు రూ.6.34 లక్షలు స్వాహా చేసిన పుంగనూరు మండలం బండ్లపల్లె కార్యదర్శి శ్రీనివాసులును బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ మాదంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు మండలంలోని బండ్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉంటూ ఈనెల 1తేదీన పంచాయతీలో పింఛన్ల నిధులు తన సొంత అవసరాలకు ఖర్చు చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకం



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడుతోందని ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గోపినాయుడు, శంకర్, దేవ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పేరుతోనే స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు. చౌకదుకాణాల వద్ద వేలి ముద్రలు పడకుండా లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



రామస్వామి (ఫైల్ ఫొటో)

పెద్దపంజాణి, సెప్టంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ టిడిపి నాయకుడు మృతిచెందిన సంఘటన పెద్దపంజాణి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పెద్దపంజాణి పంచాయతీ బెరపల్లె గ్రామానికి చెందిన పంచాయతీ టిడిపి అధ్యక్షుడు రామస్వామి(60) బుధవారం ఉదయం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా ద్విచక్రవాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో రామస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ ఇతడిని స్థానికులు పలమనేరు వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సీనియర్ నేతలకు రాష్ట్ర పదవులు

రామకుప్పం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరుగా రామకుప్పం మండలం పెద్దకురబలపల్లెకు చెందిన టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మునస్వామి బల్ల పంచాయతీ సర్పంచిగా, రామకుప్పం జడ్పీటీసీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మునస్వామి సీనియారిటిని, పార్టీ పట్ల నిబద్ధతను టీడీపీ అధిష్టానవర్గం గుర్తించి ఆయనను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరుగా అవకాశం కల్పించింది. ఆయన నియామకం పట్ల బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గుర్రప్ప, శ్రీనివాసులురెడ్డి నరసింహులు, జయశంకర్, సత్తి, కొల్లుపల్లిబాబు, వెంకటరమణ, రామకృష్ణప్ప, సలాంసాబ్, బాలరాజు, సుబ్రీ, టీవీరవి, అవినాశ్, మంజునాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, రవిరెడ్డి, లోకేష్, నాగభూషణం, కామరాజనాయక్, ఆదిల్, శ్రీనాథరెడ్డి, కొల్లుపల్లెవిజయ్, సురేష్, రఘు, భూపతి తదితరులు తమ హర్షం వ్యక్తం చేశారు.

● **వి.కోట:** రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టరుగా వి.కోట మండల కుంబార్లపల్లెకు చెందిన టీడీపీ వి.కోట మండల అధ్యక్షుడు రంగనాథ్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగనాథ్ గత రెండు దఫాలుగా టీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో ఆయన భార్య మండలాధ్యక్షురాలిగా ఉన్నారు. రంగనాథ్ రాష్ట్ర డైరెక్టరుగా నియమించడం పట్ల మండల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు అభినందనలు తెలిపారు.

దారి వివాదం - టీడీపీ నేతపై దాడి

వి.కోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నడమంత్రం గ్రామంలో దారి వివాదం నేపథ్యంలో టీడీపీ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘుపై వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఈ దాడిలో రఘు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. కృష్ణమూర్తి తన పొలంతోపాటు పొలాలకు వెళ్లే దారిలో సైతం రాగివిత్తనాలు జల్లుతుండగా టీడీపీ ఎస్టీ నేత రఘు అభ్యంతరం వ్యక్తం చేశాడు. రైతులు తమ పొలాలకు వెళ్లే దారిని వదిలి విత్తనాలు చల్లుల్లుకోవాలని కోరాడు. ఈ విషయంలో జోక్యం చేసుకున్న స్థానిక వైసీపీ శ్రేణులు, పాతకక్షలతో రఘుపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. దాడిలో రఘుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రఘుకు వి.కోట ఆస్పత్రిలో చికిత్సనందించి అక్కడి వైద్యులు సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. గతంలో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలను మనుసులో పెట్టుకుని, తమపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారని రఘు కుటుంబసభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘును ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు తదితర నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘుపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పుంగనూరు-పలమనేరు మార్గంలోని గూడూరుపల్లె సమీపంలో మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు వివరాలు... పట్టణంలోని మౌతీనగర్‌కు చెందిన నజురుల్లా కుమారుడు షాన్‌వాజ్(19) ద్విచక్రవాహనంలో గూడూరుపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా టిట్కోఇళ్లకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో షాన్‌వాజ్ గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన షాన్‌వాజ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించినట్లు బాధితుడు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు దుకాణాల్లో విక్రయించడానికి ఉంచిన రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఎస్బీ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ సూర్యనారాయణ, సిబ్బంది కలిసి సామిరెడ్డివీధిలో ఉన్న రెండు దుకాణాలను తనిఖీ చేశారు. ప్రకాష్, రవిలకు చెందిన దుకాణాల్లో 50 కిలోల బస్తాతో నిండిన 20 బస్తాల(పది క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు.

పోటీతత్వంతో సృజనాత్మక పరిష్కారాలు అన్వేషించాలి



కేఈసీలో సింపోజియంను ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవడమే కాకుండా సృజనాత్మక పరిష్కారాలను అన్వేషించాలని అనంతపురం జేఎన్‌టీయూ అడ్మిషన్స్ అండ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'అంతరిక్ష 2కె25' అనే అంశంపై జాతీయ స్థాయి సింపోజియం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్‌టీయూ డైరెక్టర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం గమనిస్తూ వాటిని అభ్యాసం ద్వారా అనువర్తించుకోవాలన్నారు. సరికొత్త నైపుణ్యాలను అధ్యయనం ద్వారా సంపాదించుకుంటూ జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. దీని ఆధారంగా సుస్థిరమైన వృత్తిని, స్థిరమైన అభివృద్ధికర భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తరచూ ఇటువంటి సింపోజియంలలో పాల్గొంటూ ఆలోచనల మార్పిడి, జ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేయాలన్నారు. ఇలాంటి చర్యలు కేవలం సాంకేతిక నైపుణ్యాలను మాత్రమే కాకుండా వ్యక్తిగత సంబంధాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సింపోజియంలో దేశవ్యాప్తంగా పాల్గొన్న విద్యార్థులు ప్రెజెంటేషన్స్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్స్, టెక్నికల్ క్విజ్ వంటి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. తమలోని ప్రతిభను నిరూపించే సాంకేతిక నైపుణ్యాలతోపాటు సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ విజయవంతమైన పథానికి తగు నిర్దిష్ట ప్రణాళిక, కృషి చేయడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, విభాగాధిపతి కె.లోకేశ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో అపార నమ్మకం



అరుణ, జ్ఞానశేఖర్ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం మరింతగా పెరిగిందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. బుధవారం ఎంపీటీసీగా ప్రమాణస్వీకారం చేసిన మణీంద్రం ఎంపీటీసీ అరుణ, ఆమె భర్త ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌లను పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో భవిష్యత్‌లో ఏ ఎన్నికలు జరిగినా కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని వారు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలను ప్రజలకందిస్తూ, క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతోందన్నారు. వైసీపీ పాలనలో దగాకు గురైన రాష్ట్ర ప్రజలు ఏడాది పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పట్ల ప్రజలంతా సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో జనం అభద్రత భావంతో జీవించాల్సి వచ్చిందని, ప్రస్తుతం ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచన, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గుర్రప్ప, శ్రీనివాసులురెడ్డి నరసింహులు, జయశంకర్, సత్తి, కొల్లుపల్లిబాబు, వెంకటరమణ, అవినాశ్, మంజునాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, రవిరెడ్డి, లోకేష్, నాగభూషణం, కామరాజనాయక్, ఆదిల్, శ్రీనాథరెడ్డి, కొల్లుపల్లెవిజయ్, సురేష్, రఘు, భూపతి, భువన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మణిష్, చంద్రశేఖర్‌రెడ్డి, భానుమూర్తి, అలివేలుమంగమ్మ, పద్మమ్మ, సురేష్, వీరనాగపురంనాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం నియోజకవర్గంలో ఇకపై సోలార్ విద్యుద్దీపాలు



రామకుప్పం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వీధుల్లో సోలార్ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయనున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, రెస్కో చైర్మన్ ప్రతాప్ తెలిపారు. బుధవారం రామకుప్పంలో ఎంపీపీ సులోచన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో వారు మాట్లాడుతూ పీఎం మోదీ, సీఎం చంద్రబాబుల ఆశయాల కనుగుణంగా కుప్పం నియోజకవర్గంలోని అన్ని ఇళ్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు, వీధుల్లో సోలార్ విద్యుద్దీపాలు ఏర్పాటుకు రెస్కో యంత్రాంగం సన్నద్ధమవుతోందన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా సహకరించాలని వారు కోరారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై వారు స్పందిస్తూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఏడాది కాలంలో ప్రభుత్వం పలుగ్రామాలకు బీటీరోడ్లు, వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. అదేవిధంగా అధ్వానంగా మారిన వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులను కూడా పునర్నిర్మాణం చేపట్టిందన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలను కలుపుతూ ఉన్న పలు రహదారులను పునర్నిర్మాణం విషయమై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సమావేశంలో పాల్గొన్నా ఏఎంసీ చైర్మన్ రాజు తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి విషయంలో బేషజాలకు పోకుండా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అదేవిధంగా అభివృద్ధి పనుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, డీటీ బాలాజీ, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, రెస్కోవైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్ విండో డైరెక్టరు సురేష్, రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, సతీష్, కడా ఏసీ మెంబర్ రఘు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న రామాంజనేయులు రెడ్డి

సదుం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సదుంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, ధరల పట్టిక ప్రదర్శన, రైతులకు చెల్లిస్తున్న బిల్లులు వంటి అంశాలను పరిశీలించారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నది వాస్తవమే అయినా సరఫరా అయిన యూరియాను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా శాఖాపరమైన చర్యలు తప్పవని దుకాణాల యజమానులకు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి రామాంజనేయులు రెడ్డి, ఎస్ఐ రామచంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని చెట్లు నేలమట్టం



సదుం-రెడ్డివారిపల్లె మార్గంలో రోడ్డుకు ఇరువైపులా తొలగించిన చెట్లు

సదుం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు తగులుతాయన్న కారణంగా పచ్చని చెట్లను మొదలుతో సహా నేలమట్టం చేస్తున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరాలు తెలిపినా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోవడం లేదు. తీగలకు తగిలే కొమ్మలను మాత్రం కత్తిరించినా ఫరువాలేదని, రోడ్డుకి ఇరువైపులా వాటర్ షెడ్ పథకం ద్వారా పెంచిన పచ్చని చెట్లను ఇష్టారాజ్యంగా జేసీబీతో నేలమట్టం చేయడం దారుణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి తీగలకు తగిలే కొమ్మలను మాత్రమే తొలగించడం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోశాలకు భూమి కేటాయించాలి

పుంగనూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో గోశాల నిర్మాణానికి భూమిని కేటాయించాలని అఖిల భారతీయ గో రక్షా మహాసంఘ్ జాతీయ కార్యదర్శి పి. అయూబ్‌ఖాన్ బుధవారం తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు జాతి ఆవులను సంరక్షించడానికి, ప్రతిరోజూ పుంగనూరు నుంచి మూగజీవాలను తరలిస్తున్నారని వాటిని కాపాడేందుకు గోశాల నిర్మాణానికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. దేశంలో 90శాతం పాల ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని గోశాల నిర్మాణానికి భూమిని కేటాయించాలని వినతి చేశారు.

యూరియా కోసం రైతుల నిరసన



సదుంలో విజయలక్ష్మి ఎరువుల దుకాణం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సదుం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం సదుంలో రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో గత కొద్దిరోజులుగా యూరియా విక్రయం జరగడం లేదు. దీంతో రైతులకు సమాధానం చెప్పలేక ఎరువుల దుకాణదారులు షాపులకు తాళాలు వేసుకున్నారు. సాగు చేసిన అరాకొరా పంటలకు సకాలంలో యూరియా అందించలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి యూరియా సరఫరాకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

వెదురుకుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలం పాతపాళ్యం గ్రా మంలో జరిగిన మహిళ హత్యకేసులో నిందితుడిని పోలీసులు బుధవార ం అరెస్టు చేశారు. మంగళవారం పోలీసుల విచారణలో పూజను తానే హత్య చేసినట్లు భాస్కర్ ఒప్పుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో నిందితుడైన భాస్కర్‌ను బుధవారం ఎస్ఆర్‌పురం పోలీసుస్టేషన్‌లో నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ అరెస్టు చూపించి, రిమాండుకు తరలించారు.

సుబ్రమణ్యస్వామి ఆలయ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్ రాయ కొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యా స్వామి ఆలయ నూతన పాలక వర్గం బుధవారం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలయ నూతన పాలక వర్గ చైర్మన్ ఏజీ సంపత్, సభ్యులుగా టీకే శ్రీనివాస్ బాబు, వీజీ నందకుమార్, ఆర్.వినీత, బి.శెల్వి, బి.జమున, పి.మోహన్‌బాబు, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఐ.ఆర్.పద్మనాభంలతో ఈవో వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, అర్చకులు వేల్ మురుగన్, సుధాకర్ గురుకుల్, శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

స్త్రీ శక్తి విజయోత్సవ సభలో చల్లా బాబు





సభలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి - మహిళలతో కలసి బోయకొండకు వెళుతున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె/పుంగనూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మరో పదేళ్లు చంద్రబాబు సీఎంగా ఉంటే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లె మండలం దిగువపల్లెలో పుంగనూరు నియోజకవర్గస్థాయి స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏ సీఎం చేయని సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ నేతలు చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు,కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు,ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, సుహేల్‌బాషా, జి.సుబ్రహ్మణ్యం,భూషణ, సదుం సునీల్‌రెడ్డి,రవికుమార్ నాయుడు, ధనం జయనాయుడు,రెడ్డిప్రసాద్‌రెడ్డి,మహేశ్వరరెడ్డి, శంకర్, రామకృష్ణంరాజు, మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ పార్వతి, రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలాదిమంది మహిళలతో గంగమ్మ దర్శనం

సభకు ముందు వేలాదిమంది మహిళలతో కలసి చల్లా రామచంద్రారెడ్డి తదితరులు కాలినడకన కొండపైకి వెళ్లి బోయకొండ గంగమ్మను దర్శించుకుని సీఎం చంద్రబాబు ఆరోగ్యంగా, మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండేలా దీవించాలని పూజలు నిర్వహించారు. మహిళలందరికీ స్త్రీ శక్తి పేరుతో అమ్మవారి పసుపు కుంకుమ, లడ్డూప్రసాదాలు అందజేశారు.మహిళలు చంద్రబాబు ఫొటోలకు పాలాభిషేకం చేసి ర్యాలీలో పాల్గొన్నారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి మహిళలు భారీఎత్తున సభకు బస్సుల్లో తరలివచ్చారు.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మామోగ్రాం సర్వీస్ ప్రారంభం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మామోగ్రామ్ ఏర్పాటు మహిళలకు వరంలాంటిదని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అపోలో గ్రూపు ఏర్పాటు చేసిన మామోగ్రామ్ సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు సాధారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతుంటారని, వాటిని గుర్తించేందుకు చిత్తూరులో సరైన పరికరాలు లేవన్నారు.అపోలో యాజమాన్యం మామోగ్రాం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు.మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత, అపోలో, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్లు రంగనాథ్, ఉషశ్రీ, అపోలో సీవోవో నరేష్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎంవో సంధ్య, రేడియాలజిస్ట్ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'విండోల్లో' నూతన వ్యాపారాలపై దృష్టి పెట్టండి:అమాస



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలు(సింగిల్‌విండోలు) నూతన వ్యాపారాలపై దృష్టిపెట్టి లాభాలు గడించాలని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సింగిల్‌విండోల అధ్యక్షులకు సంఘ కార్యకలాపాలు, సహకార చట్టాలు, సంఘాల బలోపేతం, డీసీసీబీకి సింగిల్ విండోల సంబంధాల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత బ్యాంకు సీఈవో శంకర్ బాబు నూతన అధ్యక్షులకు వారి అధికారాలు-అమలు అంశాలనువివరించారు.చైర్మన్ మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి బంగారం రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జన ఔషధి దుకాణాలు, పెట్రోల్ బంకులు, నిర్మాణమై ఖాళీగా వున్న గోదాములను బాడుగలకు ఇవ్వడం, వాటిపై ప్రతిపాదనలు డీసీసీబీకి పంపితే పరిశీలిస్తామన్నారు.డీసీవో లక్ష్మి, డీసీఏవో నారాయణమ్మ, బ్యాంకు జీఎం మనోహర్ గౌడ్, చిత్తూరు డీఎల్‌సీవో వెంకటరమణ పాల్గొన్నారు.

తలనొప్పితో మూడవ తరగతి విద్యార్థిని మృతి

● టీచర్ కొట్టడంతోనే అంటున్న తల్లి



నిషావాణి మృతదేహం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్వరం, తలనొప్పితో బాధపడుతూ ఓ చిన్నారి బుధవారం చనిపోయింది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని గోకులం వీధికి చెందిన ఇందుకు ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాలతో భర్త వదిలి వెళ్లిపోవడంతో కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఇద్దరు పిల్లల్లో పెద్ద కుమార్తె నిషావాణి ఖాజీ పాఠశాలలో మూడో తరగతి చదవుతోంది. గత నెల 21వ తేదీన పాఠశాల నుంచి తీసుకెళుతుండగా నిషావాణి తలనొప్పిగా ఉందని చెప్పింది. దాంతో మందులషాపులో మాత్రలు కొనివ్వగా తలనొప్పి తగ్గలేదు. తరచూ తలనొప్పి, జ్వరం వస్తుండటంతో ఈ నెల 1వ తేది చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చూపించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సలహా మేరకు ఆస్పత్రిలో చేర్పించినప్పటికీ రోజు రోజుకూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. అయితే పాఠశాలలో టీచర్ తలపై బలంగా కొట్టడంతోనే తలనొప్పితో బాధపడేదని, ఆ విషయాన్ని తన కుమార్తె తనకు చెప్పిందని మృతురాలి తల్లి ఇందు ఆరోపించారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని మృతురాలి తల్లి కోరారు.

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగ ల ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆయన కథనం మేరకు... గత జూలై నెలలో పుంగనూరు కుమ్మరవీధికి చెందిన వృద్ధురాలు భాగ్యలక్ష్మి దుకాణానికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని దొంగలు ద్విచక్రవాహనంలో వచ్చి తన బంగారు చైన్ లాక్కెళ్లారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఉదయం పట్టణ శివారు ప్రాంతంలో అనుమానంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పంచమాలెన్‌కట్టాలోని గాంధీనగర్‌కు చెందిన రహ్మత్‌అలీ కుమారుడు హంసయూన్సన్(30), తిరునగర్‌కు చెందిన బోలోహరాస్ కుమారుడు మహ్మద్‌ఫితా(25)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిని మదనపల్లె కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15రోజులు రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు ఇద్దరు కలిసి తమిళనాడు రాష్ట్రంతో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఆయన వివరించారు.

నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి!



- ● స్విమ్స్ డెంటల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు వైసీపీ నేత టార్గెట్
- ● 2023లో తీవ్ర పోటీతో పెండింగ్
- ● జాగ్రత్తగా ప్లాన్ చేసి తాజా నోటిఫికేషన్ జారీ
- ● నేటికీ స్విమ్స్‌ను వీడని వైసీపీ ప్రభావం

స్విమ్స్ అధికారులు 2023 అక్టోబరు 22న రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 'డెంటిస్ట్రీ'గా పేర్కొన్నారు. తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ ఈ పోస్టును చూపారు. డిపార్టుమెంట్ అన్న కాలమ్‌లో డెంటిస్ట్రీ బదులు 'ఓరల్, మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' అని పేర్కొన్నారు. తాను అనుకున్న వ్యక్తికి ఆ పదవి దక్కేలా తిరుపతిలోని వైసీపీ ముఖ్యనేత ఒకరు చెప్పడంతో తాజా నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ బదులు.. ఎండీఎస్‌లో ఒక స్పెషాలిటీ పేరు పెట్టారని అంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలైనా స్విమ్స్‌లో మాత్రం ఆయన ప్రభావం కనిపిస్తుండటం ఈ నోటిఫికేషనే నిదర్శనం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గత నెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో డెంటల్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఉంది. ఆ విభాగాన్ని డెంటిస్ట్రీ అని పేర్కొనాలి. దీనికి ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ)లో ఎనిమిది స్పెషాలిటీల వైద్యులందరూ దరఖాస్తు చేయడానికి అర్హులవుతారు. ఆ ప్రకారమే 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. మరిప్పుడు ప్రత్యేకించి 'ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ' అన్న స్పెషాలిటీని మాత్రమే నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇలా చేయడం వెనుక తిరుపతికి చెందిన వైసీపీ ముఖ్య నేత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ నేత సిఫార్సు చేసిన వ్యక్తికి ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు దక్కేందుకే ఇలా చేశారని అంటున్నారు. 2023 అక్టోబరు 22న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో డెంటిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును చేర్చారు. ఆ పోస్టుకు వైసీపీ నేత తనకు కావాల్సిన అభ్యర్థిని సిఫారసు చేసినట్లు సమాచారం. అప్పట్లో వైసీపీనే అధికారంలో ఉండటంతో ఆ నేత సూచించిన అభ్యర్థికే ఆ పోస్టు దక్కుతుందని ధీమాతో ఉన్నారట. అందుకని రూ.25 లక్షలకు బేరం కుదుర్చుకుని ఆ నేత వ్యక్తిగత సహాయకుడి ద్వారా రూ.23 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో ఈ పోస్టుకోసం రాష్ట్ర అత్యున్నత నేత.. సీఎంవోలో చక్రం తిప్పిన అధికారి తమ వాళ్లకూ సిఫారసు చేయడంతో టీటీడీ కీలక అధికారి తీవ్ర ఒత్తిడికిలోనై ఆ పోస్టును భర్తీ చేయలేదని సమాచారం. ఆ డబ్బు వెనక్కి ఇవ్వాలని ఆ వ్యక్తి వైసీపీ నేతను ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. డబ్బు ఇవ్వని ఆయన.. వైసీపీ ప్రభుత్వంలో నియమితులై ఇప్పటికీ కొనసాగుతున్న స్విమ్స్ కీలక అధికారులపై ఒత్తిడి తెచ్చి తాజా నోటిఫికేషన్‌లో ఆ పోస్టును మళ్లీ చేర్పినట్లు ప్రచారం జరుగుతోంది. తాను సూచించిన అభ్యర్థికే పోస్టు దక్కేలా .. ఆ వ్యక్తి చేసిన స్పెషాలిటీని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారనే ప్రచారం నడుస్తోంది. ఇలాగైతే తక్కువ మంది దరఖాస్తు చేస్తారని తద్వారా తమ అభ్యర్థికి అవకాశం ఇప్పించుకోవచ్చని ఆ నేత భావించారట. ఈ విభాగంలోని రెగ్యులర్ ప్రొఫెసర్‌ది 'ఓరల్, మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' స్పెషలైజేనే. ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కూ ఇదే స్పెషాలిటీ పేర్కొనడం ద్వారా స్విమ్స్ అధికారులు తీవ్ర విమర్శలను, ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆ అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టును డెంటిస్ట్రీ డిపార్టుమెంటు కింద చూపకుంటే తామంతా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతామని స్విమ్స్‌లోనే డెంటల్ విభాగంలో అడహాక్ పోస్టుల్లో కొనసాగుతున్న కొందరు బతిమలాడినట్టు సమాచారం. వారికి ఆ వైసీపీ నేత వ్యక్తిగత సహాయకుడు.. స్విమ్స్‌లో కొందరు అధికారుల నుంచీ బెదిరింపులు ఎదురైనట్టు తెలిసింది. దీనిపై వివరాలు సేకరించిన టీటీడీ పాలకమండలి సభ్యులొకరు టీటీడీ ఈవోకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. కాగా, గత ప్రభుత్వంలో పెద్దల సిఫారసుతో బయటి నుంచి నియమితులైన కీలక అధికారులు ఇంకా కొనసాగుతుండటంతో వైసీపీ హవా నడుస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

● ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో లేదా ఇతర ప్రసార మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.సీఎం చంద్రబాబు ప్రారంభించిన హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయిందని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ వార్త పూర్తిగా అవాస్తమన్నారు.ప్రజలు నమ్మదగిన ప్రసార మాధ్యమాల ద్వారానే సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రసారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటలపై గజరాజుల బీభత్సం



కల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. సుమారు రెండేళ్ల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు వివిధ దఫాలుగా పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు అపారనష్టం కలిగిస్తున్నాయి. ఏనుగుల గుంపు దాడుల్లో నష్ట పోయిన పంటలకు తూతూమంత్రంగా పరిహారం చెల్లిస్తుండటంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడులతో పంటలను పూర్తిగా కోల్పోతున్నామని, ఇక ఆత్మహత్యలే శరణ్యంగా ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని చల్లావారిపల్లి పంచాయలో మంగళవారం రాత్రి రాగి, వేరుశనగ, కొబ్బరిచెట్లను ఏనుగుల ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం జరిగింది. ముందుగా తూర్పు విభాగం అటవీప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన ఏనుగుల గుంపు చల్లావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని దామోదర్‌నాయుడుకు చెందిన ఎకరా టమోటాపంట, అర ఎకరా వరిపంటను ఏనుగుల గుంపు చేశాయి. రైతు రామచంద్రకు చెందిన ఎకరా రాగిపంట, వేరుశనగ పంటను ధ్వంసం చేశాయి. సుమారు 30 ఏళ్ల కొబ్బరిచెట్టును నేలమట్టం చేశాయి. రైతులు ఎస్వీరమణ, వేణుకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. బుధవారం పగలంతా గంటావారిపల్లికి తూర్పు విభాగంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు స్థానిక ప్రజలు తెలిపారు.

అక్టోబరు 25న బాలోత్సవం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబరు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాప్, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలతోపాటు జానపద నృత్యం, జానపద గీతాలు, భక్తిగీతాలు, కోలాటం, క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని వివరించారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించడానికి స్వచ్ఛంద సేవకులు పేర్లను 9398000686 నంబరు వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

పలమనేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో బుధవారం రూ.80 వేలు విలువైన 4 కిలోల గంజాయిని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. డీఎస్పీ ప్రభాకర్ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పుంగనూరుకు చెందిన షేక్ సుల్తాన్ (29), ఎస్.ఖాజా(29), రామసముద్రంలోని దిగువపేటకు చెందిన బర్మా సయ్యద్ జుల్ఫర్‌నెయిన్ (28), సయ్యద్ మొహమ్మద్ ఇస్మాయిల్(27)లు గంజాయి విక్రయాలు చేపడుతుతూ స్వాధీనం చేసుకొన్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ముద్దాయిలతోపాటు పలమనేరు అర్బన్ సీఐ మురళీమోహన్, గంగవరం సీఐ పరశురాముడు, పలమనేరు ఎస్ఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు ఏఎంసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే జగన్మోహన్, ఏఎంసీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ చైర్‌పర్సన్ అనురాధ ప్రమాణం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):మామిడి రైతులకు సబ్సిడీ విషయంలో సహకరించని గుజ్జు ఫ్యాక్టరీలకు సహచర ఎమ్మెల్యేలతో కలిసి తాళం వేయిస్తానని ఎమ్మెల్యే జగన్మోహన్ హెచ్చరించారు. చిత్తూరు ఏఎంసీ పాలక మండలి బుధవారం మార్కెట్ యార్డులో ప్రమాణస్వీకారం చేసింది. గౌరవ అధ్యక్షుడిగా జగన్మోహన్, చైర్‌పర్సన్‌గా ఝాన్సీ వెంకటేష్, వైస్ చైర్‌పర్సన్‌గా టి.అనురాధ, సభ్యులుగా జి.రామ్మూర్తి, ఎ.గంగి నాయుడు, ఇ.గోవిందస్వామి, జి.రాణి, ఎంఎస్ నందిని, వి.నాగరాజు, కేబీ జయపాల్, ఎ.మోహన్‌నాయుడు, సయ్యద్ ఫిరోజ్, ఎంజీ హేమచంద్ర, ఆరణి అంజలి, ఎం.మీనాక్షి, కె.గౌరీలతో మార్కెటింగ్ ఏడీ, ఏఎంసీ కార్యదర్శి పరమేశ్వరన్ ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించగా కొన్ని ఫ్యాక్టరీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని రైతు సంఘం నాయకులు తమ దృష్టికి తెచ్చారన్నారు.సీఎం నిర్దేశించిన ధర రైతులకు ఇవ్వని పక్షంలో పూతలపట్టు, జీడీ నెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలతో కలసి ఫ్యాక్టరీలకు తాళం వేస్తానని హెచ్చరించారు.చిత్తూరు ఏఎంసీకి ఆదాయ వనరులు సమకూర్చడంతో పాటు మామిడి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్,యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ అధ్యక్షుడు సీఎంటీ త్యాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రప్రకాష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ నాగేశ్వరరాజు, టీడీపీ నాయకులు కోదండయాదవ్, అశోక్ ఆనంద్‌యాదవ్, షణ్ముగం, వైవీ రాజేశ్వరి, నళిని, మోహన్‌రాజ్, నీరజాక్షులు నాయుడు, జీవన్, రఘు, సుబ్రమణ్యం, నరేష్‌కుమార్, మేషక్, పీటర్, సప్తగిరి ప్రసాద్, భాస్కర నాయుడు, లత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జనసేన నాయకురాలు ఆరణి కవిత తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెం తీరం... కల్లోలం

● వేట విరమించిన మత్స్యకారులు



వాకాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాకాడు మండలంలోని తూపిలిపాళెంలోని సముద్రతీరం కల్లోలంగా మారింది. వాతావరణంలో మార్పుతో ఆరు మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడుతున్నాయి. కొన్ని నిమిషాల పాటు సముద్రం నిశబ్ధంగా మారుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పును బట్టి మత్స్యకారులు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామునుంచే హోరుగాలితోపాటు ఇసుకరేణువులు గాలిలో తేలి తూపిలిపాళెం సముద్రతీరంలో వచ్చిన పర్యాటకులకు, నిమజ్జనానికి విచ్చేసిన భక్తులకు తీవ్ర ఆటంకంగా మారింది. అల్పపీడన ప్రభావంతో తీర ప్రాంతాలకుచెందిన తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, వైట్‌కుప్పం తదితర గ్రామాల మత్స్యకారులు వేట విరమించారు.

ఆరు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 5, పలమనేరులో ఒక బార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఒక్కో బార్‌కు రూ.5.10 లక్షలు తిరిగిరాని దరఖాస్తు రుసుముగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 14వ తేది సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ, 15వ తేది ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో లాటరీ ద్వారా బార్‌ల కేటాయింపువుంటుందని ఆప్రకటనలో ఈఎస్ తెలిపారు.

భారీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో అర్హులైన ఐదుగురు మహిళలకు భారీ మోటార్ డ్రైవింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు ఎస్సీలుగా ఉండి, కనీస వయస్సు 20 సంవత్సరాలు ఉండాలన్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు ఎల్‌ఎంవీ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. హెవీ మోటారు వెహికల్ ఎల్‌ఎల్‌ఆర్ కోసం రూ.210, లైసెన్స్ కోసం రూ.1060 మాత్రమే అభ్యర్థి చెల్లించాల్సి ఉందన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో భారీ మోటార్ డ్రైవింగ్‌ను ఉచితంగా నేర్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు లైట్ మోటారు వెహికల్ లైసెన్స్‌ను తీసుకుని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం, అంబేడ్కర్ భవన్ మొదటి అంతస్తు, న్యూ కలెక్టరేట్, చిత్తూరు అనే చిరునామాలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 99590 15657 నెంబరును సంప్రదించాలని కోరారు.

చీటీల పేరుతో ఆర్పీ మోసం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో మహిళా పొదుపు సంఘాల ఆర్పీ తమను మోసం చేసిందని బాధితులు ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ నగరంలోని మిట్టూరుకు చెందిన ఆర్పీ శ్వేత, ఆమె భర్త రిటైర్డ్ ఆర్మీ జవాన్ కిరణ్ చీటీల వ్యాపారం పేరుతో సుమారు రూ.80 లక్షల వరకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని చెప్పారు. తమ పేరుతో మహిళా గ్రూపుల్లో లోన్లు తీసుకోవడం, చీటీలు వేసి డబ్బులు ఇవ్వకుండా బెదిరించడం, తమ నగలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవడం, చీరల వ్యాపారం చేస్తున్నానని లక్షల్లో వడ్డీలకు తమ దగ్గర తీసుకున్నారని చెప్పారు. తమ డబ్బు తిరిగి ఇవ్వమని అడిగితే భార్యాభర్తలు గన్‌తో బెదిరిస్తున్నారని చెప్పారు.

లిక్కర్‌స్కామ్‌ను సిట్ తేలుస్తుంది


మీడియాతో మాట్లాడుతున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వహయాంలో లిక్కర్‌స్కామ్ జరిగిందా లేదా అనేది సిట్ అధికారులు తేలుస్తారని, ఒకవేళ స్కామ్ జరిగివుంటే ఎవరెవరు ఏపాత్ర వహించారో, ఎంత మొత్తం డబ్బు స్కామ్‌కు పాల్పడ్డారనే విషయాలు వెలుగులోకి వస్తాయని పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్‌లు అన్నారు. గంగాధరనెల్లూరులో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎక్సైజ్‌శాఖమంత్రిగా కొనసాగినందున ఆశాఖలో జరిగిన అవినీతిపై సిట్ అధికారులు విచారించారని, అంత మాత్రానికే ఆయనకు ఆ పార్టీనేతలు క్లీన్‌చిట్ ఇచ్చుకుంటున్నారని.. కోర్టుల ద్వారా క్లీన్‌చిట్ వస్తే అప్పుడు ప్రజలు హర్షిస్తారని అన్నారు. నేతలు బాబునాయుడు, వెంకటేశులునాయుడు, కోదండరెడ్డి, శివప్రసాద్, దేవరాజు, ప్రభాకర్‌నాయుడు, నీరజాక్షులురెడ్డి, జాన్, మునస్వామి, నరసింహులు, ప్రకాష్, పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో మాట్లాడుతున్న సుధాకరరెడ్డి

● వెదురుకుప్పం: ప్రజల పాలిట దేవుడిగా ప్రజాసేవ చేస్తున్న జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌పై వైసీపీ పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారం చేస్తే తాటతీస్తాం.. ఖబడ్దార్ అంటూ తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, వెదురుకుప్పం మండలం చవటగుంట పీఏసీఎస్ ఛైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. వెదురుకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే థామస్‌పై బురద చల్లే ప్రయత్నంలో వైసీపీ కుక్కలు మొరగడం దౌర్భాగ్యమన్నారు. వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి, పీఏసీఎస్ డైరెక్టర్ పైడి మనోహర్‌నాయుడు, ఏఎంసీ డైరెక్టరు వరప్రసాద్, నాయకుడు బోడిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటికి సిట్ ఎందుకు వచ్చిందో వైసీపీ శాడిస్టు నాయకులు చెప్పాలని కార్వేటినగరం టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ కార్వేటినగరంలో మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మేళం రవియాదవ్, జగన్నాథం, సోమశేఖర్, వాసుదేవరెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు. ● శ్రీరంగరాజపురం: ఎమ్మెల్యే థామస్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని సింగిల్‌విండో ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నారాయణస్వామి ఇంటికి సిట్ అధికారులు వచ్చినప్పుడు ఆయన వారి కాళ్ల పట్టుకున్నారంటూ అక్కడ జరిగిన సన్నివేశాన్ని ఎమ్మెల్యే తెలిపినందుకను గాను ఆయనపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కుమార్, నాగరాజు, గజేంద్ర, కుప్పయ్య, వెంకటాచాలం, ఢిల్లీ పాల్గొన్నారు.

● పెనుమూరు: ప్రభుత్వ విప్ థామస్‌ను విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని మండల యువత అధ్యక్షులు చిరంజీవిరెడ్డి, ప్రధానకార్యదర్శి భాస్కర్ అన్నారు. పెనుమూరులో మీడియాతో మాట్లాడుతూ జీడీనెల్లూరు వైసీపీ నాయకుడు వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యేని ఉద్దేశించి మాట్లాడిన మాటలు బాధాకరమన్నారు. చిరంజీవి, ఎస్‌ఎస్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి, అశోక్, మున్నా పాల్గొన్నారు.

రథోత్సవ సందడి




కాణిపాకంలో రథం ముందు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, దేవతామూర్తుల వేషధారులు


కాణిపాకం వినాయక స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ద్వారకాతిరుమల ఆలయ అధికారులు, పుష్పాలంకరణలో ధ్వజస్తంభం, కోలాటం చేస్తున్న భక్తులు, ప్రత్యేక ఆకర్షణగా పొడుగు మనుషులు, వినాయక వేషధారి

భక్తులకు మామిడి పండ్ల రసం పంపిణీ



మామిడి పండ్ల రసం స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పండ్ల పరిశ్రమ సమైక్య, ఆల్ ఇండియాఫుడ్ ఫుడ్ ప్రాసెస్ అసోసియేషన్ ఉమ్మడిగా భక్తులకు మామిడి పండ్ల రసాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. మామిడి పళ్ల రసానికి ప్రజల్లో ఆదరణ బాగా పెరిగిందని, ప్రజలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పండ్ల రసాలను విరివిగా తీసుకోవాలని ఈవో పెంచలకిషోర్, హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, చిన్నారెడ్డి, సౌత్ జోన్ ఛైర్మన్ కట్టమంచి బాబి పాల్గొన్నారు.

నారాయణస్వామిపై విమర్శలు చేయడం తగదు: కృపాలక్ష్మి

వెదురుకుప్పం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కృపాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి చేయాల్సిందిపోయి, ప్రతిపక్షాలను అసభ్య పదజాలంతో దూషించేందుకు గాను ఎమ్మెల్యే థామస్ రాజకీయాల్లోకి వచ్చారా అని ఆమె ప్రశ్నించారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం పిళ్లై

యాదమరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ శాఖ నూతన అధ్యక్షుడిగా కె.సుబ్రహ్మణ్యం పిళ్లై ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదమరి జడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మండల మైనార్టీ కన్వీనర్‌గా కె.గొల్లపల్లి జడ్పీహైస్కూల్‌కు చెందిన ఎస్ఎండీ సుల్తాన్ ఎన్నికయ్యారని చెప్పారు. పదవీ విరమణ పొందిన గుణశేఖరన్, కోలా వాసులను నాయకులు సత్కరించారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, ప్రమీల, గణపతి, రంగనాథ్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు.

పెనుమూరు మార్కెట్ కమిటీకి ఐదవ ఛైర్మన్‌గా కృష్ణమనాయుడు

● నేడు పెనుమూరులో కమిటీ ప్రమాణస్వీకారం


ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఐదవ ఛైర్మన్‌గా ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు ఎంపికైన విషయం తెలిసిందే. గంగాధరనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన, చిత్తూరు సెల్‌టాన్, లక్ష్మీవాచ్ మొబైల్స్‌షాపుల యజమాని ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు (ఇ.కె. నాయుడు) నాలుగేళ్ల క్రితం పాతపాళ్యం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై పదవిలో కొనసాగుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇప్పుడు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గంగాధరనెల్లూరు, పెనుమూరు, పాలసముద్రం మండలాలతో కలిపి పెనుమూరు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు గంగాధరనెల్లూరులో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడులకు టీడీపీనేతలు క్రేన్ ద్వారా భారీ గజమాలతో స్వాగతం పలుకుతారు. తర్వాత అల్లియెల్లమ్మ గుడిలో పూజకార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం గంగాధరనెల్లూరు, పాలసముద్రం మండలాలనుండి వచ్చిన టీడీపీనేతలతో కలిసి సుమారు 200 కార్లతో ర్యాలీని ప్రారంభించి, చిత్తూరుకు బయలుదేరుతారు. చిత్తూరు నగరంలోని మహాత్మాగాంధీ, ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అక్కడ నుండి ర్యాలీగా పెనుమూరు మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకుని ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

సజ్జ కంకుల్ని కాల్చేశారు

విజయపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సజ్జ కంకుల్ని గుర్తు తెలియని దుండగులు కాల్చేసిన సంఘటన మండలంలోని ఆమగుంటలో జరిగింది. ఆమగుంటలో రైతు రామ్మూర్తి రెండున్నర ఎకరాల సజ్జ సాగుచేసి నూర్పిడి కోసం గ్రామానికి సమీపంలో రోడ్డు పక్కన ఎండ బెట్టి, యంత్రం కోసం ఎదురు చూస్తున్నాడు. రామ్మూర్తి అంటే గిట్టని కొందరు దుండగులు పథకం వేసి మంగళవారం రాత్రి బాగా ఎండిన సజ్జ కంకుల్ని కాల్చివేశారు. దీంతో తనకు సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ మహేష్‌బాబుకు ఫిర్యాదు చేయగా, ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బాస్కెట్‌బాల్‌లో విజయం విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న విజయం అధినేత తేజోమూర్తి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటి ప్రథమ స్థానం సాధించినట్లు ఆ విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 24 నుంచి 26 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న గురు చరణ్ జట్టు ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లారన్నారు. విశాఖలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో గురు చరణ్ జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలవడం కళాశాలకు గర్వకారణమన్నారు. బుధవారం విద్యార్థులను అభినందించారు.

గంగజాతరకు ఎమ్మెల్యేకి ఆహ్వానం

నిండ్ర, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరిలో నిర్వహించే గంగజాతరకు రావాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను జాతర నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం తిరుపతిలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 8వ తేదీ రాత్రి గంగమ్మను భారీగా ఊరేగించి పురవీధుల్లో ప్రతిష్ఠించనున్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు దుకాణాల్లో విక్రయించడానికి ఉంచిన రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఎస్‌బీ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ సూర్యనారాయణ, సిబ్బంది కలిసి సామిరెడ్డివీధిలో ఉన్న రెండు దుకాణాలను తనిఖీ చేశారు. ప్రకాష్, రవిలకు చెందిన దుకాణాల్లో 50 కిలోల బస్తాతో నిండిన 20 బస్తాల(పది క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు.

శ్మశానం దారిని పరిశీలించిన ఆర్డీవో

విజయపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురం దక్షిణ ఆది ఆంధ్రవాడ శ్మశానం దారి సమస్య విషయమై బుధవారం ఆర్డీవో అనుపమ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ సర్వే చేసి శ్మశానానికి దారి ఏర్పాటు చేసి, ఆక్రమణలు తొలగిస్తామన్నారు. తహసీల్దార్ కిరణ్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాలు పెట్టాలని మండల ప్రత్యేకాధికారి పద్మమ్మ సూచించారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు.

ప్రతి కార్యకర్తనూ టీడీపీ గుర్తిస్తుంది



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఏఎంసీ సభ్యులు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ ఛైర్‌పర్సన్ అనురాధలను సన్మానిస్తున్న రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్ అన్నారు. ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గాంధీ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఏఎంసీ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బ్యాండు, బాకా వాయిద్యాల నడుమ కోలాహలంగా బయలుదేరిన ర్యాలీ చిత్తూరు మార్కెట్ కమిటీ ప్రాంగణానికి చేరుకుంది. ప్రమాణస్వీకార మహోత్సవ సభలో వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా తాను పార్టీ జెండా మోస్తూ కష్టపడుతున్నానని, శ్రమను గుర్తించిన పార్టీ గతంలో రెండు సార్లు ఏఎంసీ కమిటీ సభ్యుడిగా నియమించిందని, ప్రస్తుతం తన భార్య ఝాన్సీరాణికి ఏఎంసీ ఛైర్మన్ పర్సన్ పదవి దక్కడంపై రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా పార్టీలో పనిచేయడంతో పాటు గత ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయడంతో స్థానిక ఎమ్మెల్యే ద్వారా తనకు ఈ పదవి వచ్చిందని వైస్‌ఛైర్‌పర్సన్ అనురాధ అన్నారు. పాలకవర్గంలోని సభ్యులు పార్టీతో వారికున్న అనుభవాలను పంచుకున్నారు. వీరిని పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

మండల అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నిండ్ర, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం నిండ్ర మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై మండల అధికారులు స్పందించి ప్రజాప్రతినిధులకు సహకరించాలన్నారు. కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిండ్రలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో డ్యూటీ వైద్యాధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, రోడ్డు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభా, కో-ఆప్షన్ సభ్యులు అనిల్, తహసీల్దార్ శేషగిరిరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఎంఈవో శ్రీధర్ రాజు, వైద్యాధికారిణి వినిషా, పశు వైద్యాధికారి సాయి సౌందర్య, పీఆర్ ఏఈ వీరభద్రయ్య, ఏవో తులసిరాం, ఏపీఎం పళణి, ఏపీవో చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి ఆలయ పాలక వర్గం ప్రమాణ స్వీకారం


నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే గురజాల తదితరులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్ రాయకొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలయ నూతన పాలక వర్గ ఛైర్మన్ ఏజీ సంపత్, సభ్యులుగా టీకే శ్రీనివాస్ బాబు, వీజీ నందకుమార్, ఆర్.వినీత, బి.శెల్వి, బి.జమున, పి.మోహన్‌బాబు, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఐ.ఆర్.పద్మనాభంలతో ఈవో వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, అర్చకులు వేల్ మురుగన్, సుధాకర్ గురుకుల్, శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో హార్వర్డ్ విద్యార్థి యశ్వంత్ సాయి ప్రతిభ


యశ్వంత్ సాయిని అభినందిస్తున్న హార్వర్డ్ యాజమాన్యం

చిత్తూరుసెంట్రల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్థానిక హార్వర్డ్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కె.ఎస్.యశ్వంత్ సాయి సాత్విక్ సత్తా చాటినట్లు కరస్పాండెంట్ భాస్కర్ తెలిపారు. ప్రిన్సిపాల్ త్రివేణి, కోఆర్డినేటర్ లక్ష్మీపతిలతో కలిసి బుధవారం పాఠశాలలో యశ్వంత్‌ను మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

వెదురుకుప్పం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలం పాతపాళ్యం గ్రామంలో జరిగిన మహిళ హత్యకేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మంగళవారం పోలీసుల విచారణలో పూజను తానే హత్య చేసినట్లు భాస్కర్ ఒప్పుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో నిందితుడైన భాస్కర్‌ను బుధవారం ఎస్‌ఆర్ పురం పోలీసుస్టేషన్‌లో నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఆర్‌పురం ఎస్‌ఐ సుమన్ అరెస్టు చూపించి, రిమాండుకు తరలించారు.

మృతుడి కుటుంబానికి రోజా పరామర్శ

విజయపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతార్కాడులో ఇటీవల మృతి చెందిన రవి కుటుంబాన్ని మాజీ మంత్రి రోజా బుధవారం పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సానుభూతి వ్యక్తం చేశారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వైసీపీ విభాగం ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్, సుధాకర్‌రాజు, సుబ్బుయాదవ్ పాల్గొన్నారు.